క్లుప్తంగా

అంగన్‌వాడీ బడిబాట



అల్మాస్‌గూడలో అంగన్‌వాడీ బడిబాటలో పాల్గొన్న టీచర్ నిర్మల, తల్లిదండ్రులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో మంగళవారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. 5 సంవత్సరాలలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి మాట్లాడుతూ.. చిన్నారులకు సరిపడా పోషకాహారంతో కూడిన గుడ్లు, ఆహార పదార్థాలు, డ్రెస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు. యూకేజీ, నర్సరీ, ఎల్‌కేజీల పేరుతో ప్రైవేట్ స్కూళ్లు, కార్పొరేటర్ స్కూళ్లు, కిడ్స్ పేరుతో తల్లితండ్రుల వద్ద వేలకు వేలు ఫీజులు కట్టిస్తున్నారన్నారు. అన్ని విధాల చిన్నారులకు సరిపడా ఎడ్యుకేషన్ అందిస్తున్నామని, మీ పిల్లలను దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నిర్మల, హెల్పర్ టి.సురేఖ, చిన్నారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

మున్సిపల్ కమిషనర్ వాణి



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వాణి, అధికారులు

తుక్కుగూడ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాలు దరిచేరవని కమిషనర్ ఏ.వాణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాల 5వ వార్డులో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రణాళికలో భాగంగా 9వ రోజు వార్డు ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించామన్నారు. డ్రైన్స్, నాలాలను క్లీనింగ్ చేశామన్నారు. వీధి కుక్కలను గుర్తించి, బ్లూ క్రాస్ సొసైటీ వారికి అప్పగించామని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ సామిక్‌కుమార్, స్వార్పి, వార్డు అధికారి అశోక్, ఈఈ ప్రశాంత్, పుర సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: మున్సిపాలిటీలోని ప్రజలందరూ తడి, పొడి చెత్తపై అవగాహన పెంచుకోవాలని కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో మంగళవారం తడి, పొడి చెత్తపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు.నీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తను సరైన పద్ధతిలో వినియోగిస్తే విలువైనదిగా మారుతుందన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఆటోలకు అందిస్తే సేంద్రియ ఎరువులుగా మార్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెండు రకాల చెత్తను ఒకే దగ్గర ఇస్తే పర్యావరణానికి హాని చేకూర్చినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి ఎం.శ్రీను, శానిటేషన్ సూపర్‌వైజర్ బి.కుమార్, ఆర్పీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిర్లాహిల్స్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మాణం పూర్తయిన భవనం



కందుకూరు: పులిమామిడి జెడ్పీ పాఠశాలలో పిల్లర్ల దశలో ఆగిన డైనింగ్ హాల్

దరిచేరని 'మన బడి'

- పలు పాఠశాలల్లో అసంపూర్తి నిర్మాణాలు
- పూర్తయిన గ్రామాల్లో స్కూళ్లకు అప్పగించని వైనం

మీర్‌పేట: నూతన భవనాన్ని నిర్మించిన అధికారులు, పాలకులు దీన్ని పాఠశాలకు కేటాయించడాన్ని విస్మరించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో 'మన ఊరు మన బడి' కింద నాలుగు తరగతి గదులతో కూడిన నూతన భవనాన్ని నిర్మించారు. ఇందుకు సంబంధించిన పనులు ఏప్రిల్ నెలలోనే పూర్తయ్యాయి. 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నప్పటికీ భవనాన్ని కేటాయించకపోవడం గమనార్హం. ప్రస్తుతం స్కూల్‌కు రెండు తరగతి గదులు అవసరం ఉండగా, ఇంకా భవనాన్ని అందజేయకపోవడంతో మొదటిరోజు విద్యార్థులు బయటే కూర్చోవాల్సి ఉంటుందని స్థానిక కాలనీవాసులు తెలిపారు.

బిల్లు రాలేదని..?

భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్‌కు పూర్తి బిల్లులు రాకపోవడంతోనే భవనాన్ని పాఠశాలకు అందజేయడం లేదని తెలుస్తోంది. బిల్లులు రాలేదనే సాకుతో భవనాన్ని స్వాధీనం చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, పరిసర కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు పాఠశాలల్లో ఆగిన పనులు

కందుకూరు: మన ఊరు– మన బడి పథకం కింద రెండేళ్ల క్రితం మండలంలోని 20 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో రాచులూరు పీఎస్‌కు(ప్రాథమిక పాఠశాల) రూ.2.25 లక్షలు, మీర్‌ఖాన్‌పేట పీఎస్‌కు రూ.2.42 లక్షలు, మీర్‌ఖాన్‌పేట జెడ్పీ పాఠశాలకు రూ.7.92 లక్షలు, ముచ్చర్ల యూపీఎస్‌కురూ.2.36 లక్షలు, బేగంపేట యూపీఎస్‌కు రూ.7.25 లక్షలు, ఆకులమైలారం పీఎస్‌కు రూ.9.09 లక్షలు, జెడ్పీ పాఠశాలకు రూ.24.34 లక్షలు, లేమూరు పీఎస్‌కు రూ.6.68 లక్షలు, జెడ్పీ పాఠశాలకు రూ.21.04 లక్షలు, పులిమామిడి పీఎస్‌కు రూ.3.48 లక్షలు, జెడ్పీ పాఠశాలకు రూ.21.13 లక్షలు, తిమ్మాపూర్ పీఎస్‌కు రూ.2.91 లక్షలు, జెడ్పీ పాఠశాలకు రూ.20.98 లక్షలు, కందుకూరు పీఎస్‌కు రూ.10.97 లక్షలు, బాలికల జెడ్పీ పాఠశాలకు రూ.1.85 లక్షలు, బాలుర జెడ్పీ పాఠశాలకు రూ.75 లక్షలు, గుమ్మడవెల్లి పీఎస్‌కు రూ.9.66 లక్షలు, ధన్నారం పీఎస్‌కు రూ.16.42 లక్షలు, చిప్పలపల్లి యూపీఎస్‌కు రూ.5.05 లక్షలు, నేదునూరు పీఎస్‌కు రూ.5.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటితో ఆయా స్కూళ్లలో మరమ్మతులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలి. కానీ కందుకూరు బాలుర జెడ్పీ పాఠశాలలో నిర్మించాల్సిన అదనపు గదుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఆకులమైలారం, పులిమామిడిలో డైనింగ్ హాళ్ల నిర్మాణాలు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. మిగతా పాఠశాలల్లో నిర్దేశించిన పనులు పూర్తయ్యాయి. కేవలం ఆ మూడు పాఠశాలల్లో మాత్రమే పనులు ఆగాయి. నిధులు విడుదల కాకపోవడమేనని దీనికి కారణమని తెలుస్తోంది.

స్కూల్‌కు అప్పగించాలి



పూర్తయిన భవనాన్ని వెంటనే స్కూల్‌కు కేటాయించేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న భవనంలో సరిపడా గదులు లేవు. గతంలో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– పి.భిక్షపతిచారి, మాజీ కార్పొరేటర్

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



జంగారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

తుక్కుగూడ: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. పార్టీ ఇటీవల ప్రకటించిన మంత్రి పదవులు, కార్యవర్గ ఏర్పాటే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు ఏనుగు జంగారెడ్డిని మంగళవారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులు భూ సమస్యలు తీరుతాయన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు, స్థానిక నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని లేమూరులో అవేర్ మాధవన్‌జీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆ ఆస్పత్రి వైద్యులు ప్రభాకర్, శ్రీకాంత్ తదితరుల బృందం 142 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అవేర్ సంస్థ ప్రతినిధి ఎస్.వెంకన్న, నాయకుడు రాణాప్రతాప్‌రెడ్డి, గ్రామపెద్దలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరిక

మహేశ్వరం: మండల పరిధిలోని గొల్లూరు, నాగిరెడ్డిపల్లి, మాణిక్యమ్మగూడ, పులిమక్త, అమీర్‌పేట్ గ్రామాలకు చెందిన సుమారు 20 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మంగళవారం శంషాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చేరారు. మైహోం గ్రూప్, ఖుషీ స్వచ్ఛంద సంస్థలు ఈ స్కూళ్లను దత్తత తీసుకున్నాయి. ముచ్చింతల్ పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా విద్యా సదుపాయాలు కల్పిస్తున్నారు. కంప్యూటర్ బోధనతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫామ్స్ అందించి నాణ్యతతో కూడిన బోధన అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అబ్బేసి ఆనంద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తున్న తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లలితానగర్ ఫీడర్ పరిధిలోని లలితానగర్, గాయత్రినగర్, జిల్లెలగూడ, వెంకటసాయి కాలనీ, కమలానెహ్రూనగర్, సీతాహోమ్స్, వెంకటేశ్వరకాలనీ, లక్ష్మీనరసింహస్వామి గుట్ట, మల్లారెడ్డి రంగారెడ్డినగర్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ టీఆర్ఆర్ టౌన్‌షిప్ ఫీడర్ పరిధిలోని టీఆర్ఆర్ టౌన్‌షిప్, ఆదిత్యనగర్, సాయిరాంనగర్, మారుతీనగర్, టెలిఫోన్‌కాలనీ, గౌతంనగర్, సరళాదేవి ఎన్‌క్లేవ్, గుడ్‌లైఫ్ స్కూల్, సుమిత్ర ఎన్‌క్లేవ్‌లలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు.

న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నాం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ డబల్ బెడ్రూంలను స్థానికులకు కేటాయించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పుర పరిధిలోని శ్రీనగర్ గ్రామంలోని ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్మించిన ఈ బెడ్ రూమ్‌లను ప్రస్తుతం ఎమ్మెల్యే, అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి స్థానికులకు కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాల వారికి కేటాయించడం జరిగిందన్నారు. దీనికి వ్యతిరేకంగా, స్థానికులకు ఇవ్వాలని మంఖాల్ డబల్ బెడ్రూం సాధన సమితిని ఏర్పాటు చేసి అప్పటి ప్రభుత్వంపై ప్రజల తరపునా పోరాటం చేసి, హైకోర్టును ఆశ్రయించామన్నారు. స్థానికులకే ఇళ్లు ఇవ్వాలని, న్యాయం ఇచ్చిన తీర్పు హర్షణీయమన్నారు. దీంతో నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సాయికాలనీ, గ్రీన్‌హిల్స్‌కాలనీ, టీఎస్ హౌసింగ్ బోర్డ్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ బీరప్ప టెంపుల్, అష్టలక్ష్మీ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ ఎల్‌బీనగర్, సిరీస్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కొనసాగుతున్న బడిబాట

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను ప్రచారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమం మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది. మంగళవారం పాఠశాల సిబ్బంది ఇంటింటా తిరిగి ప్రభుత్వ బడులపై ప్రచారం చేశారు. బడీడు పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రావిర్యాలలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

అందరి సహకారంతోనే ఉత్సవాలు విజయవంతం



ఎడ్ల కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామంలోని దొంతరాల గుట్టపై నూతనంగా నిర్మించిన మల్లన్న స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు విజయవంతం కావడంలో అన్ని విధాల సహకరించిన గ్రామస్తులకు నిర్వాహకులు యాతం పవన్‌కుమార్ యాదవ్, పెరమోని నరేశ్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. నిర్మాణానికి సహకరించడంతో పాటు ఉత్సవాల సమయంలో అన్నదానం చేసిన గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణారెడ్డిని వారు సన్మానించారు.

శారదానగర్ కాలనీ అభివృద్ధికి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: శారదానగర్ కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల కోరిక మేరకు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తును జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాదాపు రూ. 80 లక్షల వ్యయంతో హాల్ నిర్మాణం జరుగుతోందన్నారు. కొన్ని పనులు మిగిలి ఉన్నాయని, త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వరదనీరు నిలుస్తోందని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లీశ్వరి, భాస్కర్‌సాగర్, శ్రావణ్, కేఎల్ఎస్.రావు, జగన్‌మోహన్, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, మధు, లక్ష్మణ్, ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్



పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మీర్‌పేట: పారిశుద్ధ్య సిబ్బంది తమ ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ సూచించారు. మున్సిపాలిటీలో వందరోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులది కీలక పాత్ర అని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సిబ్బందికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ వెంకన్న, ఆర్‌ఓ డి.చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పర్యావరణ ఇంజినీర్ రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని బోధన



ఉచిత దుస్తులు అందజేస్తున్న మహిళా సమాఖ్య మండల అధికారి సత్యనారాయణ

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా నిలుస్తున్నాయని మహిళా సమాఖ్య మండల అధికారి సత్యనారాయణ అన్నారు. మెహబ్బత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సర్కారు బడుల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. విశాలమైన తరగతి గదులు, అన్ని వసతులతో కూడిన మైదానాలు, ఒత్తిడి లేని బోధన, ప్రశాంత వాతావరణం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం భోజనం, ఉచిత యూనిఫామ్, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఆరోగ్య శిబిరాలు, కంటి పరీక్షలతో స్కాలర్‌షిప్ సదుపాయాలు అందుతాయని స్పష్టంచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమాన్‌దాస్, బీజేపీ నాయకులు శ్రీరాములు యాదవ్, పంచాయతీ కార్యదర్శి మైథిలి, మహిళా సమఖ్య సీసీ యాదయ్య, అంగన్‌వాడి టీచర్ శారద, మహిళా సంఘం నాయకురాలు అండాలు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యలకు చెక్

కమిషనర్ సరస్వతి



వైష్ణవి కాలనీలో మ్యాన్ హోళ్లను శుభ్రం చేయిస్తున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యలుగా వరదనీటి కాల్వలు, ఎస్ఎన్‌డీపీ కాల్వలు, జాం అయిన మ్యాన్ హోళ్లను క్లీన్ చేయిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి తెలిపారు. మంగళవారం 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగానే కార్పొరేషన్ పరిధిలో ఉన్న వరదనీరు, మురుగునీటి కాలువల్లో నీరు సాఫీగా వెళ్లేలా గల్పర్ మిషన్‌తో శుభ్రం చేయించారు. అలాగే కొన్ని కాలనీల్లో మ్యాన్‌హోళ్లు జామ్ కాగా ఫిర్యాదులు రావడంతో వెంటనే సిబ్బందితో క్లీన్ చేయించి మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే కార్యాలయంలో ఫిర్యాదులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్ సుందర్, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానాంజనేయ స్వామికి మంత్రి పూజలు



మంత్రి దంపతులతో ఆలయ ఈఓ లావణ్య

చంపాపేట: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి దంపతులు మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ ఈఓ లావణ్య ఆధ్వర్యంలో శ్రీహరి దంపతులను వేదపండితుల మంత్రోశ్ఛరణల నడుమ పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందించి శేషవస్త్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ, అంబా ప్రసాద్, ప్రవీణ్‌శర్మ, సిబ్బంది వెంకటయ్య పాల్గొన్నారు.

70 ఏళ్లలో కాని అభివృద్ధి 11 ఏళ్లలో చేశాం



మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

చంచల్‌గూడ: దేశంలో 70 సంవత్సరాల్లో లేని అభివృద్ధిని ప్రధాని నరేంద్ర మోదీ కేవలం 11 సంవత్సరాల్లో చూపించారని బీజేపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన పాతబస్తీలో పర్యటించి కుర్మగూడలోని భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజల సహకారంతో మోదీ మరిన్ని అద్భుతాలు సృష్టిస్తారన్నారు. వేల రూపాయల్లో ఉన్న వ్యవసాయ బడ్జెట్‌ను రూ.1.33 లక్షల కోట్లకు తీసుకొచ్చి రైతులను భరోసా కల్పిస్తున్నారన్నారు. అమృత్ భారత్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేశారన్నారు. కొత్తగా 15 ఎయిమ్స్ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. నిరంజన్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పార్టీ మరింత బలపడుతుందన్నారు. వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అభివృద్ధే లక్ష్యంగా మేయర్ పీఠం గెలుస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, నాయకులు ధర్మతేజ, కామాటీ మహేష్, నవీన్‌యాదవ్, యశ్వంత్, నాగరాజు, అరవింద్, ప్రమోద్, పెద్ద, ఈశ్వర్ తదితరులున్నారు.

సమాధుల వద్ద పరిశుభ్రత కల్పించండి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: ఆస్మాన్‌గఢ్‌లోని చారిత్రక రేమాండ్స్ సమాధుల వద్ద తగిన పర్యవేక్షణ కల్పించి పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్ విభాగం డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. రేమాండ్స్ సమాధుల ప్రాంగణం మొత్తం చెట్లు, చెదారంతో నిండిపోయి విషసర్పాలు, క్రిమికీటకాల బెడద పెరిగిందన్నారు. చుట్టూ నివాస సముదాయాలు హద్దులుగా ఉన్న చారిత్రక రేమాండ్స్ సమాధుల ప్రాంగణం మొత్తం చిన్నపాటి అడవిని తలపించేలా పెరిగిన పిచ్చి మొక్కలతో పరిసర కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్కియాలజీ విభాగం అధికారులు స్పందించి రేమాండ్స్ సమాధుల ప్రాంగణంలో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.